TGTEL/26/A0372

# మన మహతి న్యూస్

## తెలుగు దిన పత్రిక

ఎడిటర్ :డాక్టర్. ప్రకాష్ జాదవ్ | మంగళవారం జూలై 21, 2026 | సంపుటి : 01 సంచిక : 167 | పేజీలు 5 వెల-2/- MANAMAHATINEWS.COM


పార్లమెంట్ ముందు ప్రధాని మోడీ

# సజావుగా పార్లమెంట్ సమావేశాలు సాగాలి




**దేశం అనేక విజయాలను నమోదు చేస్తోంది**

**ప్రజాస్వామ్యం సుస్థిరంగా సాగాలి**
ఎన్నికలు, అధికార పక్షాలు కలిసి దేశాభివృద్ధికి దోహదం చేయాలి.

**విక్రమ్ విజయవంతం.. యువకుల నైపుణ్యం**
ఇస్రో సాధించిన విజయం ప్రతి భారతీయుడి గర్వకారణం. మన యువత నైపుణ్యం ప్రపంచానికి చాటింది.

**అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం**
ప్రతి రంగంలో దేశం పురోగమిస్తోంది. దేశ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి.

**సమగ్ర చర్చలకు ప్రాధాన్యం**
ముఖ్యమైన జాతీయ అంశాలపై పార్లమెంట్‌లో విస్తృతంగా చర్చిద్దాం.

**విక్రమ్ విజయవంతం!**
భారత యువత శక్తి ప్రపంచానికి నిరూపణ
చంద్రయాన్--3 విజయంతో ఇస్రో మరో శిఖరాన్ని తాకింది.
ఇది కోట్లాది భారతీయుల గర్వకారణం.
దిగువ భాగం

**దేశం ముందడుగు**
కొత్త సంస్కరణలు, డిజిటల్ భారత్, స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాలు వేగంగా ముందుకు సాగుతున్నాయి. అభివృద్ధే లక్ష్యంగా మన ప్రయాణం.

2లో



# ఉద్రిక్తంగా చలో పార్లమెంట్ పిలుపు

- సిజెపి కార్యకర్తల రాకతో పార్లమెంట్ వద్ద ఉద్రిక్త
- పోలీస్ బారికేడ్లను దాటుకుని వచ్చిన వేలదిమంది
- ర్యాలీని అడ్డుకునేందుకు పోలీసుల లాఠీఛార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగం



దేశ రాజధానిలోని జంతర్ మంతర్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నీట్-యూజీ పరీక్షల అక్రమాలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌తో కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద చేపట్టిన 'చలో పార్లమెంట్' కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సీజేపీ మద్దతు దారులు బారికేడ్లను తోసుకొని పార్లమెంట్‌లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నిం చారు.

2లో

ఆపదలో అండగా...

# ఆర్టీసీ ఒకే కుటుంబం..!



- కార్మికుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది
- డ్రైవర్ కోలా శంకర్ కుటుంబానికి రూ. 90.85 లక్షల ఆర్థిక సాయం
- ఉద్యోగులంతా కలిసి సమీకరించిన ధనం చెక్కు రూపంలో అప్పగింత

2లో



పామాయిల్ పెంపకం

# రైతులకు ఎంతో మేలు

- వర్షాభావంలోనూ పంటరకు ఢోకా లేదు
- పామాయిల్ ధరల పెంపునకు కృషి చేస్తున్నాం
- అంజనాపురంలో గోద్రెజ్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం
- మంత్రి తుమ్మలతో కలసి ప్రారంభించిన భట్టి



పామాయిల్ ధర పెంపునకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లా వ్యవసాయంపై ఆధారపడిన జిల్లా అని పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అంజనాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు కలిసి ప్రారంభించారు.

2లో

# హంద్రీనీవాపై వైసిపి నేతల రాజకీయం

**కాలువలపై మొసలి కన్నీరు కార్చొద్దు**
**మాజీమంత్రి పరిటాల సునీత హెచ్చరిక**



2లో

సూపర్ ఎల్‌నినో కాలంలో కూడా చాలా చోట్ల నీటి సమస్యలు ఉన్నా.. చెరువులలో నిండుగా నీరు పెట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిది అని మాజీమంత్రి పరిటాల సునీత అన్నారు. గత ప్రభుత్వంలో గంప మట్టి కూడా ఎత్తివేయని వైసీపీ నాయకులు.. హంద్రీనీవా గురించి మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. హంద్రీనీవా ప్రాజెక్టు పొడవునా ఉన్న చెరువులను ఎమ్మెల్యేలు పరిటాల సునీత, ఎంఎస్ రాజు, ధర్మవరం టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పరిశీలించారు.

## అన్ని వర్గాలనూ కాంగ్రెస్ మోసం చేసింది: కేటీఆర్



హైదరాబాద్: కాంగ్రెస్ నేతల మాటలు కోటలు దాటుతున్నాయని.. పనులు మాత్రం గడప కూడా దాటడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని.. చేశారా? అని ప్రశ్నించారు.

2లో

## తెలంగాణలో ఎక్కువగా ఎల్‌నినో ప్రభావం:

**మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**



2లో

## హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య



హైదరాబాద్: నగరంలోని బండ్లగూడ జాగీర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడిని సుధాకర్‌గా గుర్తించారు. ఇంటి బెడ్‌రూమ్‌లో విగతజీవిగా కనిపించడంతో కుటుంబసభ్యులు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మద్యం బాటిల్‌లో విషం కలిపి తాగినట్లు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సంపాదకీయం

## హే రామ్.. హే రావణ్.. ఇంత విద్వేషమా?

హే రామ్! హే రావణ్!... ఇంత విద్వేషాలు అవసరమా? కుల, మత, ప్రాంతాల వారీగా ఏమిటీ విష జ్వాలలు? తెలుగునాట, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు ఎవరి కోసం? విద్వేషపూరిత వాతావరణం సృష్టిస్తున్నది ఎవరు? దీనివల్ల ఎవరికి ప్రయోజనం? సోషల్ మీడియాను ఇంతలా దుర్వినియోగం చేస్తున్నది ఎవరు? భూమి మీద ఉన్నవారు సరిపోలేదని పురాణాల్లోని పాత్రలను కూడా వివాదాల్లోకి లాగాల్సిన అవసరం ఎవరికొచ్చింది? వాల్మీకి విరచిత రామాయణంలోని శ్రీరాముడిని, రావణ బ్రహ్మను కూడా తుచ్ఛ రాజకీయాలకోసం ముడి సరుకుగా వాడుకోవడం ఏమిటి? హిందువులు దైవ స్వరూపుడిగా కొలిచే శ్రీరాముడిని కించపరిస్తే వచ్చేది ఏమిటి? ఆ క్రమంలో రావణ బ్రహ్మను కూడా వాడుకోవడం ఏమిటి? పురాణాలను వివాదాస్పదం చేయడం వలన ప్రయోజనం ఏమిటి? వ్యాసుడు రచించిన మహాభారతంలోని సంఘటనలు, సన్నివేశాలను కూడా కించపరచడం ఏమిటి? ఈ పోకడలు అభ్యుదయ భావాలకు చిహ్నమా? హేతువాదానికి దీన్ని ప్రాతిపదికగా చెప్పుకోవచ్చా? ఎవరికోసమో ఇంకెవరో ఇంత సంకుచితంగా ఆలోచించడం, విద్వేషాలను ప్రచారం చేయడం ఆదర్శ భావాలకు ప్రతీక అవుతుందా? తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పుష్కర కాలం దాటినా తెలంగాణ వాదులమని చెప్పుకొనే కొందరికి ఆంధ్రా వారిపై అంత అక్కసు ఎందుకు? ఆంధ్రా వారికి తెలంగాణ వాదులపై కినుక ఇంకా అవసరమా? ఒకటి రెండు రాజకీయ పార్టీలకోసం ప్రజల మధ్య విభజన గీతలు గీస్తూ విద్వేషాలను ఎగదోయడం ఏమిటి? రాజకీయ విమర్శలకు--వ్యక్తిగత దూషణలకు మధ్య తేడా ఉండదా? ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలో కూడా చోటుచేసుకుంటున్న తాజా పరిణామాల నేపథ్యంలో ఈ ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. భాష--యాసలను కించపరచడం ఎలా అభ్యంతరకరమో హిందూ మత గ్రంథాలను అవమానించడం కూడా అంతే ఆక్షేపణీయం. ఈ పోకడల వల్ల ఒకటి రెండు రాజకీయ పార్టీలకు తాత్కాలిక ప్రయోజనం చేకూరవచ్చుగానీ దీర్ఘకాలంలో దాని వల్ల కలిగే అనర్థాల గురించి ఆలోచించారా? అధికారంలోకి రావాలనుకుంటున్న వారికిగానీ, అధికారంలో ఉన్నవారికిగానీ ఈ ధోరణులను అరికట్టాల్సిన బాధ్యత లేదా? సంక్షేమ పథకాల పేరిట అడ్డగోలుగా ఉచితాలను ప్రకటిస్తూ ప్రజలను సోమరిపోతులుగా చేయడమే కాకుండా రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలను ఛిన్నాభిన్నం చేసిన, చేస్తున్న రాజకీయ పార్టీలు... ఇప్పుడు మత ప్రాతిపదికన ప్రజలను చీల్చి ఏమి సాధించాలనుకుంటున్నాయి? కారణం ఏదైనా కొంతకాలం యువతే యువకులు రాజకీయ పార్టీల చేతిలో పావులుగా మారి సోషల్ మీడియా వేదికగా రెచ్చిపోతున్నారు. తెలంగాణలో మరుగునపడుతున్న తెలంగాణ సెంటిమెంటును రగిలించడానికి ప్రయత్నం జరుగుతుండగా, ఆంధ్రప్రదేశ్‌లో కుల మత ప్రాతిపదికన విభజన సృష్టించే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో జోసెఫ్ అలియాస్ రావణ్ అనే వ్యక్తి సోషల్ మీడియా వేదికగా చేసిన వీడియోలు, వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదం అయ్యాయి. ఈ వివాదం చిలికి చిలికి గాలివానగా మారింది. పోలీసులు అతడిని 'ఉపా' చట్టం కింద అరెస్టు చేశారు. దీంతో రావణ్ అనే వ్యక్తికి అనుకూలంగా, వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ఎవరికి తోచినట్టు వారు పోస్టులు, వీడియోలు పెడుతున్నారు. మరోవైపు తమ మత గ్రంథాలను, దేవుళ్లను కించపరచడంపై హిందువులు మండిపడుతున్నారు.

**ఎందుకీ వైపరీత్యం...**

రాజకీయ ప్రయోజనాల వేటలో మత గ్రంథాల జోలికి వెళ్లడం ఎందుకో? రంధ్రాన్వేషణ చేయడం మొదలు పెడితే ప్రతి మత గ్రంథంలోనో లోపాలు కనిపిస్తాయి. రామాయణంలోని రాముడిని హిందువులు దైవంగా పూజిస్తారు. అలాంటి శ్రీరాముడిని కించపరుస్తూ మాట్లాడటం వల్ల హిందువులు సహజంగానే బాధపడతారు. శ్రీరాముడి పాత్రలోని ఔన్నత్యాన్ని గుర్తించకుండా లోపాలను మాత్రమే ఎత్తిచూపడం వల్ల సమాజానికి కలిగే ప్రయోజనం ఏమిటి? ఒక మతం వారు మరో మతానికి చెందిన ఆరాధ్య దైవాలను కించపరుస్తూ పోతే పరిస్థితి ఎక్కడికి దారి తీస్తుందో అర్థమవుతోందా? తండ్రి మాట జవదాటని, ఆడిన మాట తప్పని మహోన్నతుడిగా శ్రీరాముడిని వాల్మీకి ఆవిష్కరించారు. అందుకే శ్రీరాముడిని పురుషోత్తముడిగా హిందువులు ఆరాధిస్తారు. శ్రీరాముడు అరణ్యవాసం చేసినా, సీత చేత అగ్నిప్రవేశం చేయించినా అందులో అద్భుత సందేశం ఉందని నమ్ముతారు. దీనివల్ల క్రైస్తవాన్ని స్వీకరించిన జోసెఫ్ అనే వ్యక్తికిగానీ, అతడిని సమర్థించే వారికిగానీ వచ్చే నష్టం ఏమిటో తెలియదు. శ్రీరాముడిని వెక్కిరిస్తున్నామని అనుకొని తమ పేర్లను రావణ్‌గా మార్చుకుంటున్న వారికి రామాయణంలోని రావణ బ్రహ్మ క్యారెక్టర్ ఔన్నత్యం గురించి ఏ మాత్రమూ తెలియదనుకోవాలి. రావణ బ్రహ్మ రాక్షసుడు కాదు! అణువణువునా శివ భక్తిని నింపుకొన్నవాడు. శూర్పణఖ ముక్కు చెవులూ కోశారన్న కోపంతో సీతను అపహరించడమే రావణ బ్రహ్మ చేసిన అపరాధం. అపహరించిన సాధ్వి సీత చిటికెన వేలు కూడా అతను ముట్టుకోలేదు. అవకాశం ఉండి కూడా ఆమెను తాకలేదు. త్రేతాయుగ ధర్మం ప్రకారం పరస్త్రీని అపహరించడం, వాంఛించడం మహాపాపం అని చెప్పడం కోసమే వాల్మీకి ఆ సన్నివేశాన్ని సృష్టించి ఉంటారు. తన చావుకు తనతోనే ముహూర్తం పెట్టిస్తున్నారని తెలిసి కూడా ముహూర్తం పెట్టుకున్న మహోన్నత పాత్ర రావణ బ్రహ్మది. పురాణాల్లోని సంఘటనలు, సన్నివేశాల్లోని పరమార్థం తెలుసుకోకుండా వెకిలి వ్యాఖ్యలు చేయడం... అలా చేస్తున్న వారి అల్పత్వానికి నిదర్శనం అవుతుందే తప్ప పౌరాణిక పాత్రల ఔన్నత్యం ఏ మాత్రం తగ్గదు. మహాభారతాన్నే తీసుకుందాం. మనుషుల్లోని బలాలు బలహీనతలన్నీ మహా భారతంలోని పాత్రలలో కనిపిస్తాయి. సర్వకాల సర్వావస్థలకూ వర్తించే మహాభారతాన్ని మించిన గ్రంథం మరొకటి ఉంటుందా? వ్యాసుడిని మించిన రచయిత మరొకరు కనిపిస్తారా? అని ప్రశ్నించుకోవాలి. ఆయా సన్నివేశాల్లోని పరమార్థాన్ని గ్రహించకుండా అదేమిటీ ఇదేమిటీ అని రంధ్రాన్వేషణకు పూనుకోవడం మన అల్పత్వానికి నిదర్శనం. ఇప్పుడు కూడా మన చుట్టూ ఉన్న అనేక క్యారెక్టర్లు మహాభారతంలో కనిపిస్తాయి. అంతేకాదు, అన్ని వేల పాత్రలకు పేర్లు పెట్టడం సామాన్య విషయం కాదు కదా? మన పిల్లలకు పేర్లు పెట్టడానికి రోజుల తరబడి బుర్రకు పదునుపెడుతూ పుస్తకాలు తిరగేస్తున్న మనకు వ్యాసుడి గొప్పతనం తెలియకపోతే ఎలా? మానవ జాతి పరిణామంలో అనేక జాతులు, మతాలు పుట్టాయి. అందులో కొన్ని అంతరించాయి. ఈ వాస్తవాన్ని గుర్తించకుండా ఈ ఆధునిక యుగంలో కూడా రాతి యుగం నాటి మూర్ఖత్వం ప్రదర్శించడం ఏమిటి? రెండు వేల సంవత్సరాల క్రితం క్రైస్తవ మతం లేదు కదా! క్రీస్తు పూర్వం, క్రీస్తు శకం అని మనమే విభజించుకున్నాం కదా! మనుషులు తమ స్వార్థం కోసం ఎంతకైనా దిగజారుతారని మత గ్రంథాలు చెబుతున్నాయి. అందుకే పాప పుణ్యాలు అని పేర్కొన్నారు. జీసస్‌ను శిలువ వేసి చంపిన మనుషులే ఆయనను దేవుడిగా మార్చుకున్నారు. సోక్రటీస్‌కు విషం ఇచ్చి చంపినవారే ఆ తర్వాత ఆయనను మహా తత్వవేత్తగా గుర్తించి గౌరవించారు. పాపం చేయడం, ఆ తర్వాత పాప పరిహారం చేసుకోవడం మనుషులకు అలవాటే. ఇప్పుడు అసలు విషయానికి వద్దాం!

**కుట్రలు.. సూత్రధారులు!**

జోసెఫ్ అలియాస్ రావణ్ అనే వ్యక్తి హిందువుల మనోభావాలను గాయపరచడం వల్ల ఏం సాధించాడు? ఉపా చట్టం కింద అరెస్టు చేయడానికి ముందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తొందరపాటుతో అతడిని నాలుగు పర్యాయాలు బలహీనమైన కేసులలో ఎందుకు అరెస్టు చేయవలసి వచ్చింది? ఈ క్రమంలో రంగప్రవేశం చేసిన క్యారెక్టర్లు ఎవరు? వారి వెనుక ఎవరున్నారు? మత విద్వేషాలు రగిలించి చలి కాచుకోవాలనుకున్న రాజకీయ పార్టీలు ఏవి? వంటి ప్రశ్నలకు సమాధానాలు అన్వేషించాలి. తెలంగాణలో కేసీఆర్ కుటుంబం, ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్‌రెడ్డి అధికారం కోల్పోయాక రాజకీయాలలో విద్వేషాలను చొప్పించడం మొదలైంది. కేసీఆర్ అధికారంలో ఉన్నంత కాలం ఆంధ్రా-- తెలంగాణ అన్న భేద భావం ప్రజల్లో కనిపించలేదు. ఇప్పుడు కేసీఆర్ అధికారం కోల్పోయిన తర్వాత అవకాశం చిక్కినప్పుడల్లా ఆంధ్రా, తెలంగాణ అనే విభజన తీసుకొచ్చే ప్రయత్నాలు మొదలయ్యాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆ మధ్య హైదరాబాద్ పర్యటన సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇళ్లకు వెళ్లడం,

## అన్ని వర్గాలనూ కాంగ్రెస్ మోసం చేసింది: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలోని అన్నివర్గాలనూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. తెలంగాణ భవన్‌లో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్‌లోనే ఉంటానని చెప్పిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాటతప్పారన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పోచారంతోపాటు కాంగ్రెస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు.

"కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయి.. మోటార్లు కాలిపోతున్నాయి. రైతులకు యూరియా అందించలేకపోతున్నారు. కేసీఆర్ హయాంలో రైతులకు అన్నీ ఇళ్ల వద్దకే వచ్చేవి. రూ.2లక్షల రుణమాఫీ చేశామని కాంగ్రెస్ నేతలు చెప్పారు. 30-40 శాతమైనా పూర్తిచేశారా? ఒక్క ఊరిలో అయినా వందశాతం రుణమాఫీ చేసినట్లు నిరూపించాలని సీఎం రేవంత్‌కు అసెంబ్లీలోనే సవాల్ విసిరా. కేసీఆర్ హయాంలో 11 సార్లు రైతుబంధు వేశారు. కాళేశ్వరంపై మాట్లాడినవన్నీ అబద్ధాలే అని ప్రజలకు తెలిసిపోతుందనే రేవంత్ నీళ్లు వదలడం లేదు. మేడిగడ్డ బ్యారేజ్‌లో కుంగిన రెండు పిల్లర్లకు మరమ్మతులు ఎందుకు చేయలేదు? ఎల్‌నినో వస్తుందని ఆరు నెలల ముందే శాస్త్రవేత్తలు చెబితే.. ప్రభుత్వం ఇప్పుడు సమీక్షలు చేస్తోంది. సరైన ప్రణాళిక లేకుండా సీఎం పనిచేస్తున్నారు" అని కేటీఆర్ విమర్శించారు.

## తెలంగాణలో ఎక్కువగా ఎల్‌నినో ప్రభావం:

మొదటిపేజీ తరువాయి

నల్గొండ: ఎల్‌నినో ప్రభావం తెలంగాణలో ఎక్కువగా ఉందని రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. వరి వేస్తే ఇబ్బందులు ఎదురవుతాయని.. ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. నల్గొండ కలెక్టరేట్‌లో నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల అధికారులతో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో నీళ్లు లేవని.. వర్షాలూ తక్కువేనన్నారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపాలన్నారు. తక్కువ నీరు అవసరమయ్యే పంటలు వేసుకోవాలని.. దీనిపై రైతులకు దిశానిర్దేశం చేయాలని అధికారులకు సూచించారు. ఎల్‌నినో పరిస్థితులకు తగ్గట్టుగా ఉమ్మడి నల్గొండ జిల్లా సిద్ధం కావాలని చెప్పారు.

## పామాయిల్ పెంపకం రైతులకు ఎంతో మేలు

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సి ఉందని.. వివిధ కారణాలతో సీఎం రాలేకపోయారని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా రైతులకు సీఎం రేవంత్‌రెడ్డి తన శుభాకాంక్షలు తెలిపారని అన్నారు. అంజనాపురంలో ఆయిల్ పామ్ కాంప్లెక్స్ నిర్మించిన గోద్రెజ్ సంస్థకు భట్టి విక్రమార్క కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి విశేషంగా కృషిచేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి అభినందనలు చెప్పారు. ఖమ్మం జిల్లా రైతన్నలు అన్ని రకాల పంటలు సాగు చేస్తారని వెల్లడించారు. తాను ఎన్నో రకాల పంటలు సాగు చేశానని ఏ పంటకు రాని దిగుబడి ఆయిల్ పామ్‌కు వచ్చిందని మంత్రి తుమ్మల స్వయంగా తనతో చెప్పారని అన్నారు. చివరకు ప్రకృతి విపత్తులను

కూడా ఈ పంట తట్టుకొని నిలబడుతుందని చెప్పుకొచ్చారు. పామాయిల్ సాగు చేసిన రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వెల్లడించారు. దేశంలో 25 లక్షల మిలియన్ టన్నుల పామాయిల్ అవసరం ఉందని తెలిపారు. దేశంలో కేవలం 12 లక్షల మిలియన్ టన్నుల పామాయిల్ మాత్రమే ఉత్పత్తి అవుతుందని చెప్పుకొచ్చారు. 1992లో ప్రారంభించిన పామాయిల్ సాగు ఇప్పటికి దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలిపే స్థాయికి వచ్చిందని భట్టి విక్రమార్క వివరించారు. గతంలో పామాయిల్ టన్ను గెల ధర రూ.12000లు ఉంటే.. నేడు టన్ను ధర రూ.23 వేలకు పెరిగిందని వెల్లడించారు. అంజనాపురంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం.. ఖమ్మం జిల్లా అన్నదాతలకు ఓ వరమని ఉద్ఘాటించారు. వ్యవసాయ ఉత్పత్తుల పరిశ్రమలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా వేదిక కాబోతోందని తెలిపారు. రాబోయే రోజుల్లో అనేక రకాల పరిశ్రమలు ఇక్కడికి రాబోతున్నాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. జిల్లాలో గోద్రెజ్ కంపెనీ ఆయిల్ పామ్ కాంప్లెక్స్ నిర్మించడం సంతోషంగా ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఈ కాంప్లెక్స్‌లో అత్యాధునిక సీడ్ గార్డెన్ ఏర్పాటు చేశారని తెలిపారు. గోద్రెజ్ కంపెనీకి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని, రైతులకు అన్ని విధాలా అందుబాటులో ఉండేలా కంపెనీ సేవలందించాలని ఆకాంక్షించారు. ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ ముందు ఉందని మంత్రి తుమ్మల తెలిపారు. రాష్ట్రంలో పది లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు కృషి జరుగుతోందని చెప్పారు. ఈ సందర్భంగా రైతులంతా ఈ పంట సాగుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయిల్ పామ్‌తో ఎలాంటి నష్టం ఉండదన్నారు. ఆయిల్ పామ్ కింద ఇప్పటికే మూడు ఫ్యాక్టరీల నిర్మాణం పూర్తయిందని, మరో ఆరు ఫ్యాక్టరీల నిర్మాణం జరుగుతోందని వెల్లడించారు. తెలంగాణ భూములు ఆయిల్ పామ్ సాగుకు అనుకూలమని మంత్రి పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో అన్ని జిల్లాల్లో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీల నిర్మాణం జరగాలన్నదే తన లక్ష్యమని చెప్పుకొచ్చారు. దక్షిణ భారతదేశ నేతలందరూ ఆయిల్ పామ్ దిగుమతిపై సుంకం తగ్గించాలని కోరుతున్నామని మంత్రి చెప్పారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నామని, ఆయిల్ పామ్ సాగుతో వారి జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు మంత్రి తుమ్మల. తన యాభై సంవత్సరాల వ్యవసాయ అనుభవంలో ఎన్నో పంటలు పండించామని, ఏ పంటకు రాని ఆదాయం దీనికి వస్తుందన్నారు. ఆయిల్ పామ్‌ను ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన నాటి నుంచి తాను కూడా సాగు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మరోవైపు, ఎల్‌నినో ప్రపంచాన్ని కబళించే పరిస్థితి ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. దాని కారణంగా రుతుపవనాలు సరిగా రాలేదని, మానవజాతి చేసిన విధ్వంసం తిరిగి మన పాలిటే మహమ్మారిగా మారిందన్నారు. దక్షిణ భారతదేశంలో ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉందని, ఉద్యానవన పంటల సాగుతో భూములను చల్లబరచాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

### ఆపదలో అండగా...

## ఆర్టీసీ ఒకే కుటుంబం..!

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్,జూలై 20: టీజీఎస్ ఆర్టీసీ కేవలం ఒక రవాణా సంస్థ మాత్రమే కాదని... వేలది మంది ఉద్యోగుల ఉమ్మడి కుటుంబమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. నర్సంపేట ఆర్టీసీ డిపోకు చెందిన దివంగత డ్రైవర్ కోలా శంకర్ కుటుంబానికి ఆర్టీసీ ఉద్యోగులు 'చేయూత' కార్యక్రమం ద్వారా స్వచ్ఛందంగా సేకరించిన రూ. 90,85,500 తొంభై లక్షల ఎనభై ఐదు వేల ఐదు వందల రూపాయల భారీ ఆర్థిక సహాయ చెక్కును సోమవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో శంకర్ కుటుంబ సభ్యులకు అందజేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ వై.నాగిరెడ్డి ల చేతుల మీదుగా దివంగత డ్రైవర్ సతీమణి హేమలత, కుమారుడు హేమంత్, కుమార్తె షాలినిలకు ఈ చెక్కును అందజేసి సంస్థ తరఫున పూర్తి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, కార్మికుల కోసం ప్రాణత్యాగం చేసిన దివంగత కోల శంకర్ కుటుంబానికి ఆర్టీసీ ఉద్యోగులందరూ అండగా నిలవడం వారి మానవత్వానికి నిదర్శనమన్నారు. శంకర్ ఆసుపత్రిలో ఉన్న సమయంలో అర్ధరాత్రి వేళ స్వయంగా వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. కుటుంబానికి ప్రజా ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, అందులో భాగంగానే దివంగత శంకర్ కుమారుడు హేమంత్‌కు ఆర్టీసీలో ఉద్యోగం కల్పిస్తున్నామని, అలాగే ఆ కుటుంబానికి ఇల్లు కూడా మంజూరు చేశామని ప్రకటించారు.

## సజావుగా పార్లమెంట్ సమావేశాలు సాగాలి

మొదటిపేజీ తరువాయి

**దేశం అనేక విజయాలను నమోదు చేస్తోంది**

**విక్రమ్ విజయవంతం..యువకుల నైపుణ్యం**

**పార్లమెంట్ ముందు మీడియాతో ప్రధాని మోడీ**

న్యూఢిల్లీ,జూలై20: పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేలా చూడాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. ఈ సమావేశాలు నిర్మాణాత్మకంగా జరుగుతాయని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా మోడీ మీడియాతో మాట్లాడారు. గత నెల రోజులుగా దేశంలో అనేక పరిణామాలు జరిగాయని వెల్లడించారు. అంతరిక్ష ప్రస్థానంలో నవశకం ప్రారంభమైందని తెలిపారు. స్టార్టప్ కంపెనీ తయారు చేసిన విక్రమ్-1 రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లిందని వివరించారు. సోమవారం పార్లమెంట్ దగ్గర మీడియాతో ప్రధాని మాట్లాడారు. భారత అంతరిక్ష ప్రస్థానంలో కీలక ఘట్టం ఆవిష్కృతమైందని ఉద్ఘాటించారు. భారతదేశ యువత అంతరిక్షంలోకి దూసుకుపోయిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. విక్రమ్-1 విజయం వెనుక యువత పాత్ర కీలకమని తెలిపారు. స్కైరూట్ విజయవంతం అవడం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. అదే సమయంలో అంతరిక్ష రంగ స్టార్టప్ స్కైరూట్ 'విక్రమ్-1' ప్రయోగం విజయవంతం అవడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. 28 ఏళ్ల సగటు వయసున్న ఆవిష్కర్తలదే ఈ ఘనత అని కొనియాడారు. 'ఏడాది కాలంలో ఎన్నో గొప్ప విషయాలు జరిగాయి. అంతరిక్షంతో సహా వేదిక ఏదైనా.. మనం సాధించిన విజయాలు దేశానికి గర్వకారణం. గత సంవత్సరం వర్షాకాల సమావేశాలకు ముందు ఒక భారతీయ పౌరుడు శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్నారు. ఇప్పుడు ఒక భారతీయ స్టార్టప్ స్కైరూట్ అద్భుతమైన ఘనత సాధించిందని మోదీ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి పరోక్షంగా చురకలంటించారు. భారత యువత అంతరిక్షంలో ఒక కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. ప్రపంచంలోని కొన్ని దేశాల్లో మాత్రమే ఇలాంటి ప్రైవేటు సంస్థలు ఉన్నాయి. స్కైరూట్ స్టార్టప్ బృందం సగటు వయసు 28 ఏళ్లని నాకు తెలిసింది. ఇక్కడ నేను 56 ఏళ్ల యువకుడి గురించి మాట్లాడటం లేదని పరోక్షంగా రాహుల్‌ను ఉద్దేశించి మోదీ అన్నారు. యువత సాధించిన ఈ విజయం యాదృచ్ఛికం కాదు. మన దేశ యువత సామర్థ్యం, ఆకాంక్షలు అంతరిక్షం వలే హద్దుల్లేనివని చెప్పే సందేశం ఇదని ప్రధాని ప్రశంసించారు. రాజస్థాన్‌లో అతిపెద్ద ఆయిల్ రిఫైనరీని దేశానికి అంకితం చేశామని వెల్లడించారు. ఒక సెమీ కండక్టర్ ప్లాంట్, గ్రీన్ హైడ్రోజన్ రైలును ప్రారంభించామని తెలిపారు. యుద్ధంతో చాలా దేశాలకు నష్టం జరుగుతోందని చెప్పారు. చమురు ధరలు అమాంతం పెరుగుతు న్నాయని తెలిపారు. 7.7శాతం గ్రోత్‌రేట్ భారత్ నమోదు చేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. 'వర్షాకాలం, వర్షాకాల సమావేశాలు.. ఈ రెండు చురుగ్గా ఉంటే ఫలితాలు గొప్పగా ఉంటాయి. అప్పుడే దేశం సంక్షేమంగా ఉంటుంది. అందుకే ఈ రెండూ మెరుగ్గా ఉండాలని కోరుకుంటున్నాను' అని మోదీ తెలిపారు. గందరగోళ పరిస్థితులకు తావులేకుండా పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చలు జరగాలని ఆకాంక్షించారు.

## ఉద్రిక్తంగా చలో పార్లమెంట్ పిలుపు

మొదటిపేజీ తరువాయి

వారిని అడ్డుకునేందుకు పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించి ఆందోళనకారులను చెదరగొట్టారు. సోమవారం పార్లమెంట్ మార్చ్ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కార్యకర్తలు, మద్దతుదారులు జంతర్ మంతర్ వద్దకు భారీగా చేరుకున్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది విద్యార్థులు కూడా హాజరయ్యారు. దీంతో ఆ ప్రాంతంలో భద్రతా దళాలు పెద్దఎత్తున మోహరించాయి.

దీంతో ఢిల్లీలోని పార్లమెంట్ వద్ద హైటెన్షన్ వాతావరణం నెలకొంది. రైసినా రోడ్డు మార్గంలో ఈ ఘటన జరిగింది. పార్లమెంట్‌కు సుమారు 200 మీటర్ల దూరంలో ఆందోళనకారుల్ని పోలీసులు అడ్డుకున్నారు. జంతర్ మంతర్ నుంచి సీజేపీ.. పార్లమెంట్ మార్చ్ చేపట్టిన విషయం తెలిసిందే. ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా వద్ద ఆందోళనకారులపై టియర్ గ్యాస్ ప్రయోగించారు. సీజేపీ కార్యకర్తలను చెదరగొట్టే ఉద్దేశంతో టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. సన్‌సద్ మార్గ్ రోడ్డులో వస్తున్న ఆందోళనకారుల్ని కూడా పోలీసులు అడ్డుకున్నారు. సన్‌సద్ మార్గ్ పోలీసు స్టేషన్ వద్ద బారికేడ్లు పెట్టి నిరసనకారుల్ని ముందుకు కదలకుండా చేశారు. అయినా తోసుకుని రావడంతో భద్రతా బలగాలు లాఠీఛార్జ్ చేశాయి. ఆ ఘర్షణలో కొందరు ఆందోళనకారులు గాయపడ్డారు. సైట్ వద్దే వారికి ప్రథమ చికిత్స అందించారు. వికాస్ మార్గ్‌లోని ఐటీవో వద్ద కూడా నిరసనకారులను బ్లాక్ చేశారు. ఐటీవో, సెంట్రల్ ఢిల్లీ రూట్లో ఇది కీలకమైన ప్రదేశం. పార్లమెంట్, జంతర్ మంతర్ ఈ మార్గంలోనే ఉన్నాయి. పార్లమెంట్ స్ట్రీట్ వద్ద వేల సంఖ్యలో సీజేపీ కార్యకర్తలు చేరుకున్నారు. వారిపై లాఠీఛార్జ్ జరిగినట్లు తెలుస్తోంది. బారికేడ్లను తొలగించేందుకు నిరసనకారులు ప్రయత్నించారు. పోలీసులకు, సీజేపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. సుమారు 15 మంది ఆందోళనకారు లను అదుపులోకి తీసుకున్నారు. ర్యాలీ ప్రారంభమైన వెంటనే నిరసనకారులను భద్రతా బలగాలు అడ్డుకున్నాయి. ఈ సందర్భంగా భద్రతా సిబ్బంది, సీజేపీ కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో వారిని చెదరగొట్టేందుకు భద్రతా దళాలు లాఠీఛార్జ్ చేశాయి. పలువురిని అరెస్టు చేశారు. మరోవైపు, ఇప్పటికే పార్లమెంట్‌కు వెళ్లే అన్ని మార్గాలను అధికారులు మూసివేశారు. జంతర్ మంతర్‌తో పాటు పటేల్ చౌక్, పార్లమెంట్ స్ట్రీట్, రైల్ భవన్ ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఐదు మెట్రో స్టేషన్లను కూడా మూసివేశారు. అలాగే సెంట్రల్ ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో మొబైల్ ఇంటర్నెట్‌ను నిలిపివేశారు. పార్లమెంట్ సమావేశాల ప్రారంభం రోజున తలపెట్టిన ఈ మార్చ్‌కు పోలీసులు అనుమతి నిరాకరించారు. ఎక్కడికక్కడ విద్యార్థులను అడ్డుకొనేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినప్పటికీ.. భారీ సంఖ్యలో నిరసనకారులు బారికేడ్లను దాటుకొని పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. దాంతో వారిని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జి చేశారు. భాష్పవాయువు గోళాలను ప్రయోగించారు. కొందరిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈక్రమంలో పలువురు పోలీసులకు గాయాలైనట్లు సమాచారం.

## హంద్రీనీవాపై వైసిపి నేతల రాజకీయం

మొదటిపేజీ తరువాయి

హంద్రీనీవా ప్రాజెక్టు పరిరక్షణ పేరుతో ఆదివారం ఆ కాలువను వైసీపీ నేతల బృందం పరిశీలించిన విషయం తెలిసిందే. హంద్రీనీవా కాలువల పరిశీలన పేరుతో వైసీపీ నేతల బృందం పర్యటనపై టీడీపీ నేతలు మండిపడు తున్నారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. హంద్రీనీవా లైనింగ్ పనులలో ఎక్కడ నాసిరకం పనులు జరిగాయని, ఏ కాంట్రాక్టర్ చేశాడో చెప్పండని నిలదీశారు. నాసిరకం పనులు చూపితే అదే కాంట్రాక్టర్‌తో పనులను సరిచేయిస్తాం. క్షేత్రస్థాయిలో వైసీపీ నాయకులు నీటితో నిండిన చెరువులను చూసి ఆత్మవిమర్శ చేసుకోండని అంటూ ఎమ్మెల్యే హితవు పలికారు. వైసీపీలో రాజకీయ అనుభవం ఉన్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి లాంటి నేతలు.. కూటమి ప్రభుత్వ అభివృద్ధిని ప్రశంసిస్తున్నారని తెలిపారు. వైసీపీ.. పార్టీ మనుగడ కోసం పొరుగు జిల్లాల నుంచి నేతలను పిలిపించుకొని కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఎన్‌సీసీ క్యాంపులో సాంస్కృతిక వేడుకలు

కాకతీయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఎన్సిసి పదో తెలంగాణ బెటాలియన్ ఎన్సిసి వరంగల్ గ్రూప్ ఆధ్వర్యంలో "సి ఎ టి సి..×ఎ"పది రోజుల క్యాంపులో భాగంగా ఎనిమిదవ రోజు క్యాంపు కమాండెంట్ కల్నల్ ఎస్ఎస్ రామదురై గ్రీన్ ఓపెన్ ఆడిటోరియంలో ఎన్సిసి క్యాడే ట్స్కు సంస్కృతిక కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ఎన్సిసి ద్వారా జీవితంలో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని క్రమశిక్షణకు మారుపేరైన ఎన్సిసి యువతకు ఒక రోల్ మోడల్ అని ప్రతిభ ఆధారంగా త్రివిధ దళాల్లో సులభంగా స్థిరపడవచ్చు అని దాని ద్వారా దేశానికి సేవ చేసిన వారవుతారని భవిష్యత్తులో క్రమశిక్షణ, సమయపాలన, నాయకత్వ లక్షణాలు అలవర్చుకొని ఉన్నతమైన అధికారులుగా ఎంతో విలువైన యూనిఫామ్ ఆర్గనైజేషన్ను ఎంచుకొని ఎన్సీసీ ద్వారా శిక్షణ పొందిన ఈ సమయంలో ఏదైతే శిక్షణ పొందారో జీవితాంతం మర్చిపోకుండా సన్మార్గంలో ప్రయాణించి సమాజంలో గౌరవమైన స్థానం పొందడానికి ఎన్సీసీ యొక్క పునాదిరాళు ్లగా ఉపయోగపడుతుందని ఈరోజు జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు మన యొక్క జాతీయ సమైక్యత భావాన్ని మరింత బలపరుస్తుందని పోటీతత్వం పెంచి వివిధ కళాశాల నుండి వచ్చిన క్యారడే ట్స్ కు బహుమతుల



ప్రధానం దేశభక్తిపై వివిధ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు మరియు బహుమతులు ప్రధానం చేశారు. ప్రతిభ ఆధారంగా డ్రిల్, ఫైరింగ్, టి ఎస్ సి, క్రీడల్లో మొదటి, ద్వితీయ బహుమతుల ప్రధాన కార్యక్రమం రామదురై ద్వారా జరిగింది. ఈ కార్యక్రమంలో వరంగల్ గ్రూప్ ఎన్సిసి శిక్షణ అధికారి కల్నల్ రియాజ్, ఫ్లయింగ్ ఆఫీసర్, నాలుగవ తెలంగాణ ఎయిర్ వింగ్ కమాండింగ్ అధికారి, ఎనిమిదవ గర్ల్స్ తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ అధికారి, 11వ తెలంగాణ బెటాలియన్ ఏ ఓ, వరంగల్ గ్రూప్ ఏవో కవిత,

క్యాంపు డిప్యూటీ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ రవి సునారే, గ్రూప్ అధికారులు,క్యాంపు అజ్జుడెంట్ కెప్టెన్ డాక్టర్ పి సతీష్ కుమార్,కెప్టెన్ డాక్టర్ ఎం .సదానందం,



ఎస్ఎం జై రామ్ సింగ్ ,లెఫ్టినెంట్ టి. గణేష్, లెఫ్టినెంట్ బి.జీవన్, చీఫ్ ఆఫీసర్ రవీందర్,జూనియర్ కమిషనర్ అధికారులు సుతారి, రాజేంద్రన్ , సోను , అనిల్ జాదవ్, అజం అలీ, మురళీకృష్ణ రెడ్డి , కమలాకర్, మూర్తి,మారుతి మద్దం, రామ్నాథ్, గిత్తే, ప్రవీణ్ డాంగ్రే, ఆఫీస్ సూపర్నెంట్ అరుణ, దత్తు, ట్రైనింగ్ విభాగం నుండి కుమారస్వామి, ప్రభావతి, మహేష్,సతీష్ ,డాక్టర్ రాజీరు, భవాని ,సజని, కాత్యాయని, జెసివోలుమరియు ఖమ్మం ,వరంగల్ నుండి 613 మంది క్యాడెట్స్ ఈ శిక్షణలో పాల్గొంటున్నారు. డప్పు సప్పులతో సంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకర్షించాయి 8 రోజుల ప్రతిభ ఆధారంగా సర్టిఫికెట్లు మరియు బహుమతులు కల్నల్ రామదురై అందజేశారు.

# సదాశివపేటలో వైభవంగా శ్రీ జగన్నాథ రథయాత్ర

**•రథయాత్రను ప్రారంభించిన డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి**

సంగారెడ్డి , జూలై 20 (మన మహతి న్యూస్ ):

అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో సదాశివపేట పట్టణంలో నిర్వహించిన శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక వేడుకకు డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి రథయాత్రను ప్రారంభించారు.

దుర్గమ్మ ఆలయం నుంచి ప్రారంభమైన రథయాత్ర శాస్త్రి రోడ్, హైవే, సుభాష్ రోడ్, గాంధీ చౌక్ మీదుగా బసవ సదన్ వరకు భక్తిశ్రద్ధలతో సాగింది. రథం వెంట వేలాదిమంది భక్తులు "జగన్నాథ్ కీ జై" అంటూ హరినామ సంకీర్తనలు చేస్తూ పాల్గొన్నారు. భజనలు, సంకీర్తనలు, ఆధ్యాత్మిక నృత్యాలు పట్టణ వీధులను భక్తిరసంతో నింపాయి.



మహిళా భక్తులు సాంప్రదాయ దుస్తుల్లో ప్రదర్శించిన కోలాట నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యాత్ర మార్గమంతా ఇస్కాన్ స్వచ్ఛంద సేవకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ, సదాశివపేటలో ప్రతి ఏడాది జగన్నాథ రథయాత్రను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తున్న ఇస్కాన్ స్థానిక శాఖ ప్రతినిధులను అభినందించారు. సమాజంలో శాంతి,




సౌభ్రాతృత్వం, ఆధ్యాత్మిక విలువల పెంపునకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సదాశివపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మునిపల్లె అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరు, సిడిసి చైర్మన్ రామ్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, నాయకులు సత్యనారాయణ, పృథ్వీరాజ్, ఇస్కాన్ ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# పెరిగిన ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించాలి: డీఈఓకు కార్మికుల వినతి

**•మేనిఫెస్టో ప్రకారం రూ.18 వేల వేతనం అమలు చేయాలని, గుడ్లు-గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్**

మన మహతి న్యూస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జులై 20

పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెరిగిన మార్కెట్ ధరలకు అనుగుణంగా గుడ్లు, కూరగాయల బిల్లులను వెంటనే సవరించి చెల్లించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)కు యూనియన్ నాయకులు వినతిపత్రం



సమర్పించారు.

ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు కే. ఉన్నికృష్ణన్, జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ప్రేమలత మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో గుడ్లు, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఒక్కో గుడ్డుపై అదనపు భారం పడుతోందని, దీనివల్ల మధ్యాహ్న భోజన కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పాఠశాలలకు అవసరమైన గుడ్లు, కూరగాయలు, వంట గ్యాస్ (ఎల్పీజీ) సరఫరా బాధ్యతను ప్రభుత్వమే నేరుగా చేపట్టాలని వారు కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు మధ్యాహ్న భోజన కార్మికులకు రూ. 18 వేల వేతనాన్ని వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కార్మికుల వేతనాల పెంపుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ప్రస్తుతం అందుతున్న వేతనాలు కూడా సకాలంలో చెల్లించకపోవడం బాధాకరమని నాయకులు పేర్కొన్నారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన సిబ్బందికి ఉచిత ప్రమాద బీమా కల్పించాలని, యూనిఫాంలు అందించాలని, వారిని పూర్తిస్థాయి కార్మికులుగా గుర్తించి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇల్లు లేని నిరుపేద కార్మికులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లను కేటాయించాలని కూడా ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# మాగనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో రెగ్యులర్ డాక్టర్ను నియమించాలి

**•సిపిఎం పార్టీ మక్తల్ ఏరియా కార్యదర్శి**

**•పుంజనూరుఆంజనేయులు**

మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా

మాగనూరు మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం రోజు సిపిఎం సిఐటియు నాయకులు సందర్శించి సర్వే చేయడం జరిగింది, మక్తల్ ఏరియా కార్యదర్శి పుంజనూర్ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెగ్యులర్ డాక్టర్ లేక ప్రజలు ఇబ్బంది పడతా ఉన్నారు ఉన్న డాక్టర్లను రెగ్యులర్ డాక్టర్ గా నియమించాలని అదేవిధంగా 16 నెలల పెండింగ్ జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు, హాస్పిటల్లో ఇప్పటివరకు అటెండర్ కూడా లేని పరిస్థితి ఉంది, అదేవిధంగా మంచినీటి మినరల్ ప్లాంట్ ను ఏర్పాటు



చేయాలని అదేవిధంగా పిహెచ్ సి కి అంబులెన్స్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాట్లాడడం జరిగింది, హాస్పిటల్కు ఇద్దరు స్టాఫ్ నర్సులు కావాలి ఒక్క హెల్త్ అసిస్టెంట్ కావాలని, పీహెచ్సీ పరిధిలో ఏడు మంది ఎంఎల్ హెచ్పి డాక్టర్లు కావాలని మాట్లాడడం జరిగింది సిఐటియు జిల్లా నాయకులు భరత్ కుమార్ మాట్లాడుతూ మాగనూరు మండల కేంద్రంలో సబ్ సెంటర్ భవనాన్ని వెంటనే నిర్మించాలని , కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసే స్టాఫ్ నర్స్ లకు రెండు మూడు నెలలైనా సక్రమంగా జీతాలు రాణి పరిస్థితి ఉంది వెంటనే రెగ్యులర్గా జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు .

ఈ సర్వేలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కు సంబంధించి అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు .

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్ పి ఎల్ సి, థైరాయిడ్ తదితర పరీక్షలకు జిల్లా కేంద్రానికి పంపాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు, స్కానింగ్, ఈసీజీ ,ఎక్స్ రే పరీక్ష యంత్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు .

ఆసుపత్రి అభివృద్ధి నిధులు గత మూడు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి హెచ్ డి ఎస్. నిధులు గానీ కేంద్రం ప్రభుత్వం నుంచి ఎన్ క్యూ ఏ ఎస్. నిధులు నుంచి రావడం లేదన్నారు.

ఆసుపత్రి పరిసరాలు అపరిశుభ్రతతో పిచ్చి మొక్కలతో, ముల్లాకంపాలతో నిండి ఉందన్నారు

సర్వే కార్యక్రమంలో వాకిటి వెంకటయ్య, మంగలి అశోక్, భాస్కర్ రాఘవేంద్ర,గోవిండ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరాహార దీక్ష భగ్నం పరిష్కారం కాదు: టిపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బుటారి రాజు

మన మహతి న్యూస్ భద్రాచలం జులై 20:

న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యావేత్త, పర్యావరణ ఉద్యమకారుడు సోనం వాంగ్‌చుక్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను భగ్నం చేయడం సమస్యకు పరిష్కారం కాదని టిపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బుటారి రాజు




అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా వ్యక్తమవుతున్న నిరసనలను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. భద్రాచలంలోని టిపిటిఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నీట్ పరీక్ష పేపర్ లీక్ ఘటనతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని, దీనికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని లేదా కేంద్ర ప్రభుత్వం ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బాధిత విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని, ఈ డిమాండ్ల సాధనకు జరిగే ప్రజాస్వామ్య పోరాటాలకు టిపిటిఎఫ్ మద్దతు ఉంటుందని తెలిపారు.

ఈ సమావేశంలో రాష్ట్ర అకాడమిక్ సెల్ సభ్యులు మునిగడప రామాచారి, జిల్లా కమిటీ సభ్యులు పాయం కృష్ణయ్య, ఎ. రామ్‌చంద్, మండల బాధ్యులు బి. రవి, బి. కాంతికిరణ్, బి. ప్రకాశ్‌రావు, వి. ముత్తయ్య పాల్గొన్నారు.

# మేడ్చల్ మల్కాజిగిరి ఐడీఓసిలో ఘనంగా ప్రజావాణి -- 84 అర్జీలు స్వీకరణ

ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి : కలెక్టర్ మను చౌదరి





మన మహతి న్యూస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జూలై 20

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ (ఐడిఓసి) సమావేశ మందిరంలో సోమవారం జిల్లా కలెక్టర్ మను చౌదరి ఐఏఎస్ అధ్యక్షతన జిల్లా రెవెన్యూ అధికారి మాలతి సమక్షంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి కలెక్టర్ స్వయంగా వినతిపత్రాలను స్వీకరించారు.

ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 84 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. అనంతరం కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు పంపించి, వాటి పరిష్కారానికి అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అర్జీల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడం ద్వారా ప్రభుత్వంపై ప్రజలకు మరింత విశ్వాసం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు

# మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి 2 రోజుల జైలు శిక్ష

మన మహతి న్యూస్ కొత్తగూడెం, జూలై 20:

మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తికి కొత్తగూడెం రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ బి. రవికుమార్ 2 రోజుల జైలు శిక్ష విధించారు.



ములకలపల్లి మండలం సుందర్‌నగర్‌కు చెందిన రవ్వ వినోద్ 29 ఏప్రిల్ 2026న సుజాతనగర్‌లో పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో 210 శాతం మద్యం మోతాదుతో పట్టుబడ్డాడు. ఈ మేరకు ఎస్సై ఎం. రమాదేవి కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టులో నిందితుడు నేరాన్ని అంగీకరించడంతో మేజిస్ట్రేట్ 2 రోజుల జైలు శిక్ష విధించారు. ఈ కేసులో కోర్టు డ్యూటీ అధికారి ఎ. మోహన్‌రావు సహకరించారు.

ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని మేజిస్ట్రేట్ హెచ్చరించారు.

# గౌరవ డాక్టరేట్ అందుకున్న ఎం జె ఎఫ్ లయన్ డాక్టర్ ఎడవల్లి కృష్ణ

మన మహతి న్యూస్ పాల్వంచ, జూలై 20:

ప్రముఖ విద్యావేత్త, మదర్ థెరిసా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (పెద్దపల్లి) వ్యవస్థాపక చైర్మన్, లయన్స్ క్లబ్ సేవాకార్యకర్త డాక్టర్ ఎడవల్లి కృష్ణకు అమెరికాలోని మేరీల్యాండ్ స్టేట్ యూనివర్సిటీ నుంచి విద్యారంగంలో చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా గౌరవ డాక్టరేట్ (పీహెచ్‌డీ ఇన్ ఎడ్యుకేషన్) ప్రదానం చేశారు.



న్యూఢిల్లీలోని ఇండియా హ్యాబిటాట్ సెంటర్‌లో జరిగిన ఇండో ఇంటర్నేషనల్ ఇంటెలెక్చువల్ కాన్క్లేవ్ కాన్వొకేషన్ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు ఈ గౌరవాన్ని అందజేశారు. విద్యారంగంతో పాటు లయన్స్ క్లబ్ ద్వారా చేపట్టిన సామాజిక సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ సందర్భంగా యూకేఎఫ్ ప్రతినిధులు, అభిమానులు, విద్యావేత్తలు, లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ ఎడవల్లి కృష్ణకు అభినందనలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో లయన్స్ సంస్థలో గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టాలని ఆకాంక్షించారు.

## పోరిక వాలీబాయి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించిన కేతావత్ కమల మధు నాయక్, లావుడియా పల్లవి రాజు నాయక్,

**ములుగు జిల్లా జులై 20 న్యూస్**



ములుగు జిల్లా వెంకటాపూర్ మండల్ మల్లయ్య పల్లె విలేజ్ అడవి రంగాపురం లో ఈరోజు పోరిక సరోజన బలరాం నాయక్, అరుణ తులసి రామ్ నాయక్ , వనిత రాజు నాయక్, కమల తల్లిగారు కి మూడోవరోజు కార్యక్రమంలో మాజీ ఎంపీ అజ్మీర సీతారాం నాయక్, శ్రీ రామ్ నాయక్, లావుడియా రాము నాయక్, రఘురాం నాయక్, దాసు నాయక్, సర్పంచ్ కిరణ్, నారాయణ సింగ్, గులాబ్ సింగ్, ధరమ్ సింగ్, భూక్య మురళి, హాజరై చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన ముఖ్య నాయకులు బంధుమిత్రులు అల్లుడు కేతావత్ కమల మధు, లావుడియా పల్లవి రాజు నాయక్, జీవన శ్రీ, సేహ్వాగ్, సంతోష్ కుమార్, రాజస్థాన్ నుండి కేతావత్ మాధవి సందీప్ కుమార్, కృష్ణవేణి విఠల్ కుమార్ డాక్టర్ శ్రీరామ్, నీల అశోక్,విజయ్, వినోద్,గ్రామ సర్పంచ్ గణేష్, గ్రామ పెద్ద మనుషులు రాజు నాయక్, జగ్రామ్ నాయక్, సమ్మె నాయక్, రఘు, శ్రీను, సర్దార్ సింగ్, సీతారాం, రతన్ సింగ్, రాము, సురేష్, ఓం సింగ్, రతన్ సింగ్, శివ, శేఖర్, సమ్మయ్య, జుమీలాల్, శంకర్, రాజు, కిషన్ నాయక్, సత్తయ్య, సామ్య నాయక్, కిషన్, జవహర్లాల్, ముఖ్య నాయకులు పాల్గొని మూడో రోజు కార్యక్రమంలో వాలీబాయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన ముఖ్య నాయకులు బంధుమిత్రులు

## అఖిలపక్ష పార్టీలు జర్నలిస్టుల ఆధ్వర్యంలో ధర్నా.





**మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా.మక్తల్.**

మండ కృష్ణ మండలంలో థైరాయిడ్ చౌరస్తాలో సోమవారం నమస్తే తెలంగాణ రిపోర్టర్‌రాము, జిల్లా ఫోటోగ్రాఫర్ తహేర్ లపై దాడినిఖండిస్తూ అఖిల నాయకులు చే ధర్నా నిర్వహించారు. అక్రమ ఇసుక రవాణాపై జర్నలిస్టు రాసిన కథనాలు రాసినందుకు ఇసుకమాఫియా విలేకరిపై భౌతిక దాడి చేయడాని ఖండిస్తూ వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కృష్ణ పోలీస్ స్టేషన్ గుడెబల్లూర్ పంచాయతీ పరిధిలోని టైరోడ్డు చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి,అఖిలపక్ష నాయకులు జిల్లా విలేకర్ల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. పాత్రికేయులపై దాడికి పాల్పడిన దుండగులను మర్డర్ 307 అరెస్టు చేసి వారికి తగిన శిక్ష విధించాలని చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు గత కొన్ని సంవత్సరాలుగా అక్రమ ఇసుక వ్యాపారం జరుగుతున్న గత పాలకులు ప్రస్తుత పాలకులు రిపోర్టర్ల పైన దాడి చేస్తున్న ఇసుక మాఫియాను అరికట్టడంలో విఫలమయ్యారని సిపిఎం జిల్లా కార్యదర్శి టి నరసింహులు అన్నారు. ఇసుక మాఫీ దాడి చేయడము చాలా సిగ్గుచేటు ఇది ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వ యంత్రాంగం పాలకులు చర్యలుతీసుకోవాలని బిజెపి నాయకులు ఖండించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

## కృష్ణ: ఎస్ఐ తీరుపై మాజీ ఎమ్మెల్యే ఆగ్రహం

**మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం.**



కృష్ణ పోలీసుల తీరుపై మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.ఓ పాత్రికేయుడిపై ఇసుక మాఫియా దాడి చేసిన ఘటనలో పోలీసులు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఎస్ఐ ఇసుక మాఫియాకు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. పోలీస్ స్టేషన్ నిర్వహణపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేస్తూ, సమస్యల పరిష్కారంలో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

## ఆదివాసి మహిళలపై దాడి చేసిన అటవీ అధికారులను సస్పెండ్ చేయాలి: లావుడ్యా సత్యనారాయణ నాయక్

**మన మహతి న్యూస్ సుజాత నగర్**



భద్రాద్రి కొత్తగూడెం, జూలై 20: అశ్వాపురం మండలం వేములూరు గ్రామంలో పోడు భూములు సాగు చేస్తున్న ఆదివాసులపై అటవీ అధికారులు దాడులకు పాల్పడటం దారుణమని బీఆర్ఎస్ సుజాతనగర్ మండల అధ్యక్షుడు లావుడ్యా సత్యనారాయణ నాయక్ ఖండించారు. మహిళా రైతులపై దాడి చేసి గాయపరిచిన అధికారులను వెంటనే సస్పెండ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.పోడు భూములకు పట్టాలు మంజూరు చేసి, ఆదివాసులకు న్యాయం చేయాలని కోరుతూ, లేకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## సదాశివపేటలో జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న వీరశైవ లింగాయత్ సమాజం సభ్యులు.

**సంగారెడ్డి, జులై 20,మన మహతి న్యూస్ :**





సదాశివపేట పట్టణంలో గత 2 సంవత్సరాలుగా ఇస్కాన్ సంస్థ సభ్యులు మాడిశెట్టి ప్రవీణ్, మార్వాడి వేణు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ పూరి జగన్నాథ రథయాత్ర మహోత్సవం భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. ఈ ఆధ్యాత్మిక వేడుకలో సదశివాపేట వీరశైవ లింగాయత్ సమాజం ఎడ్ల బజార్ అధ్యక్షులు గందిగారాజు, కోశాధికారి అమరాధి రచన్న ,కార్యనిర్వహక అధ్యక్షులు అన్మిశెట్టి జయప్రకాశ్, జిల్లా ఉపాధ్యక్షులు వీర మహేందర్ సురేష్ , శేఖర్, శేఖర్,సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని, జగన్నాథ స్వామివారి రథాన్ని లాగుతూ ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. సదాశివపేట పరిసర ప్రాంతాల్లో కూడా ఇస్కాన్ సేవా కార్యక్రమాలు మరియు ఆధ్యాత్మిక కార్యక్రమాలుకొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సమాజ ప్రతినిధులు మాట్లాడుతూ, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, భక్తి భావం మరియు సనాతన ధర్మ విలువలను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. జగన్నాథ స్వామివారి రథయాత్ర విజయవంతం కావడానికి కృషి చేసిన నిర్వాహకులు మాడిశెట్టి ప్రవీణ్‌తో పాటు ఇస్కాన్ సభ్యులను అభినందించారు.

## డైరెక్టర్ తిరుమలరావుకు మొక్కతో శు భాకాంక్షలు తెలిపిన మొక్కల రాజశేఖర్

**మన మహతి న్యూస్ కొత్తగూడెం**



తాడిచర్ల-2 బ్లాక్‌ను సింగరేణికి కేటాయించిన సందర్భంగా సింగరేణి కార్పొరేట్ సెంట్రల్ వర్క్‌షాప్‌ను సందర్శించిన డైరెక్టర్ (ఈఎం) ఎం. తిరుమలరావుకు సింగరేణి ఉద్యోగి, ప్రకృతి ప్రేమికుడు మొక్కల కె.ఎన్. రాజశేఖర్ పచ్చని మొక్కను అందించి శు భాకాంక్షలు తెలిపారు.

ప్రతిరోజూ ఒక మొక్క నాటే కార్యక్రమాన్ని కొనసాగిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్'లో ప్రశంసలు అందుకున్న రాజశేఖర్ పర్యావరణ పరిరక్షణకు చేస్తున్న సేవలను ఈ సందర్భంగా డైరెక్టర్ అభినందించారు.

## రిపోర్టర్లపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకులు బి. కొండయ్య

**మన మహతి. న్యూస్.ప్రతినిధి నారాయణపేట జిల్లా. మక్తల్**



నియోజకవర్గం..మాగనూరు మండలం, కృష్ణ మండలంలో జరుగుతున్న అక్రమ ఉస్కా దోపిడీని కవర్ చేయడానికి వెళ్లిన రిపోర్టర్లపై అధికార పార్టీ నాయకులు దాడి చేయడం అత్యంత దారుణం. ఈ ఘటనను బీజేపీ రాష్ట్ర నాయకులు బి. కొండయ్య తీవ్రంగా ఖండించారు.అధికార పార్టీ అండదండలతో అక్రమ ఉస్కా రవాణా కొనసాగుతూ పలువురు అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఎందుకు మౌనంగా ఉన్నారు? రిపోర్టర్లపై దాడి చేసిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకొని, అక్రమ ఉస్కా మాఫియాపై ఉక్కుపాదం మోపాలని బీజేపీ రాష్ట్ర నాయకులు బి. కొండయ్య డిమాండ్ చేశారు.

## డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకుడు మందుల రాధాకృష్ణ.



**సంగారెడ్డి, జూలై 20 (మన మహతి న్యూస్ ):**

బీఆర్ఎస్ పార్టీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి మందుల రాధాకృష్ణ సోమవారం డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి ఆయనకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ అనేకసంక్షేమకార్యక్రమాలనుసమర్థవంతంగా అమలు చేస్తోందని అన్నారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని, అదే విధంగా కాంగ్రెస్ పార్టీ పట్ల కూడా రోజురోజుకు ఆదరణ మరింత పెరుగుతోందనిపేర్కొన్నారు.ప్రజాసేవే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీముందుకుసాగుతోందని, రాష్ట్ర అభివృద్ధికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. వివిధ పార్టీల నుంచి నాయకులు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరడం పార్టీపైపెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుధాకర్ గౌడ్, జార్జ్, కూన సంతోష్, కిరణ్ గౌడ్, మహేష్ ముదిరాజ్, తోపాజీ హరీష్, నగేష్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## మార్కులకే కాదు.. వ్యక్తిత్వ వికాసానికే ప్రాధాన్యం:



**మన మహతి న్యూస్ భద్రాచలం**

పి.ఎస్.వి. ప్రసాద్ బాబుభద్రాచలం: జాతీయ విద్యా విధానం--2020 ప్రకారం విద్యార్థులను కేవలం మార్కుల ఆధారంగా కాకుండా మానవీయ విలువలు, నైపుణ్యాలు, సృజనాత్మకత, వ్యక్తిత్వ వికాసం ఆధారంగా అంచనా వేయడమే లక్ష్యమని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు పి.ఎస్.వి. ప్రసాద్ బాబు తెలిపారు. రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి ఆధ్వర్యంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి శిక్షణలో పాల్గొన్న అనంతరం ఆయన ఈ విషయాలను వివరించారు. సమగ్ర ప్రగతి పత్రం ద్వారా విద్యార్థుల విద్యా ప్రగతితో పాటు నాయకత్వం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, కళలు, క్రీడలు తదితర అంశాలను కూడా నమోదు చేస్తారని చెప్పారు. పిల్లలను మార్కులతో కాకుండా వారి సమగ్ర వికాసంతో ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు సూచించారు.

## కీసరలో నిషేధిత జూదంపై పోలీసుల దాడి

### 12 మంది అరెస్ట్... నగదు, పేకాట కట్టలు, మొబైల్ ఫోన్లు స్వాధీనం






**మన మహతి న్యూస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర, జూలై 20:**

మేడ్చల్--మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కీసర పోలీస్ స్టేషన్ పోలీసులు నిషేధిత జూదంపై నిర్వహించిన దాడిలో 12 మందిని అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం (జూలై 19) ఆర్జీకే డబుల్ బెడ్‌రూమ్ ఫేజ్-1, బ్లాక్ నెం.1, ఐదో అంతస్తులోని గది నెం.501లో పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. దాడిలో నగదు పందెం పెట్టి పేకాట ఆడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఎం.జీ. బేగ్ జూదం నిర్వహిస్తుండగా, ఎం.డి. అమీరుద్దీన్ అతనికి సహకరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

నిందితుల వద్ద నుంచి రూ.16,900 నగదు, 19 పేకాట కట్టలు, 13 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు కీసర పోలీసులు తెలిపారు.

# ‘ఫౌజీ’.. ఆజాద్ హింద్ ఫౌజ్ సైనికుడిగా ప్రభాస్!




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం ‘ఫౌజీ’ . ఇందులో ప్రభాస్.. ఆజాద్ హింద్ ఫౌజ్ సైనికుడిగా కనిపించనున్నారని సమాచారం. నేతాజీ సుభాష్ చంద్రబోస్ నాయకత్వంలో భారత స్వాతంత్ర్యం కోసం ఆయన చేసే పోరాటమే ఈ సినిమా ప్రధాన కథాంశమని తెలుస్తోంది. ఇందులో ప్రభాస్ ముందుగా బ్రిటీష్ ఇండియన్ ఆర్మీలో సైనికుడిగా పనిచేసి, ఆ తర్వాత సుభాష్ చంద్రబోస్ నేతృత్వంలోని ఆజాద్ హింద్ ఫౌజ్‌లో చేరుతారట.ఇది నేతాజీ బయోపిక్ కాకుండా, భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన సైనికుల కథను చూపించే చిత్రంగా ఉండనున్నట్లు టాక్. ఈ మూవీలో ప్రభాస్ పాత్ర ధైర్యసాహసాలు, త్యాగం, దేశభక్తితో నిండి ఉంటుందని సమాచారం. అయితే దీనిపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. డిసెంబరు 3న ‘ఫౌజీ’ విడుదల కానున్నట్లు తెలుపుతూ చిత్రబృందం కొత్త పోస్టర్‌ను పంచుకుంది. మునుపెన్నడూ చూడని లుక్‌లో ప్రభాస్ కనిపించడంతో ప్రేక్షకుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటి ఇమాన్వి మెరవనున్నారు. మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, జయప్రద కీలక పాత్రలు పోషిస్తున్నారు.ప్రస్తుతం, ప్రభాస్ పలు భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఆయన తదుపరి సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ‘స్పిరిట్’లో కనిపించనున్నారు. ఇందులో కథానాయికగా త్రిప్తి దిమ్రీ నటిస్తున్నారు. ఆ తర్వాత ‘సలార్: పార్ట్ 2’, ‘కల్కి 2898 ఏడీ: పార్ట్ 2’ సీక్వెల్స్ షూటింగ్స్‌లోనూ ప్రభాస్ పాల్గొననున్నారు.

# మీ సినిమాలో నటించడానికి సిద్ధం..: రాజమౌళికి పీవీ సింధు రిప్లై





జపాన్ ఓపెన్ టైటిల్ విజేతగా నిలిచి భారత స్టార్ షట్లర్ పీవీ సింధు సరికొత్త చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ తెలుగు తేజంపై సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ నేపథ్యంలో అగ్ర దర్శకుడు రాజమౌళి పోస్ట్‌కు సింధు ఇచ్చిన రిప్లై అందరినీ ఆకర్షిస్తూనే నెట్టింట ఆసక్తికర చర్చకు దారి తీసింది.సింధును అభినందిస్తూ రాజమౌళి ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. “జపాన్ ఓపెన్ గెలిచిన తొలి భారతీయురాలిగా చరిత్ర సృష్టించావు. మంచి కమ్ బ్యాక్ ఇచ్చావు. కంగ్రాట్స్ సింధు. నిన్ను చూసి దేశం గర్విస్తోంది” అని శుభాకాంక్షలు తెలిపారు. దీనికి స్పందించిన ఆమె.. “ధన్యవాదాలు రాజమౌళి సర్. మీ వారణాసి కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. ఒకవేళ మీరు తెరకెక్కించే ఏ సినిమాలో అయినా బ్యాడ్మింటన్ ప్లేయర్ పాత్ర ఉంటే.. మీ పరిచయ నటిగా మారడానికి నేను ఎంతో సంతోషిస్తాను” అంటూ నవ్వుతున్న ఎమోజీలను పంచుకున్నారు.ప్రస్తుతం సింధు రిప్లై నెట్టింట వైరల్ అవుతుండగా.. త్వరలోనే సినిమాల్లోకి రానుందా అనే చర్చ మొదలైంది. రాజమౌళికి క్రీడాకారుల నుంచి ఈ తరహా రిక్వెస్ట్‌లు రావడం ఇదేం తొలిసారి కాదు. గతంలో ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్ కూడా జక్కన్నకు ఇలాంటి రిప్లై ఇచ్చారు. తెలుగు సినిమా పాటలకు తనదైన స్టైల్‌లో డ్యాన్స్ వేస్తూ పోస్ట్‌లు పెట్టే వార్నర్‌కు.. మన దర్శకధీరుడు ‘బాహుబలి’ కీరిటాన్ని కూడా పంపారు. ఇక ‘వారణాసి’ విషయానికొస్తే.. దీని షూటింగ్ ప్రస్తుతం చివరి దశలో ఉంది. అక్టోబర్ నాటికి పూర్తి చేసి వచ్చే ఏడాది ఏప్రిల్‌లో రిలీజ్ చేయనున్నారు



# పగ్లైట్’ దర్శకుడి చిత్రంలో జాన్వీ?

వైవిధ్యమైన పాత్రల్లో నటిస్తూ కుర్రకారుని ఆకట్టుకునేలా తెరపై సందడి చేస్తోంది బాలీవుడ్ అందాల తార జాన్వీ కపూర్. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఆమె ఖాతాలోకి మరో ప్రాజెక్టు చేరినట్లు తెలుస్తోంది. ‘పగ్లైట్’ ఫేమ్ దర్శకుడు ఉమేశ్ బిస్ట్ రూపొందించనున్న ఓ చిత్రంలో జాన్వీ నటించనున్నట్లు సమాచారం. ఈ సినిమాని ఏక్తా కపూర్, వినీత్ జైన్ సంయుక్తంగా నిర్మించనున్నారట. ఈ ప్రాజెక్టు ఈ ఏడాది అక్టోబరు, నవంబరు నెలల్లో సెట్స్‌పైకి వెళ్లనున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో ఉమేశ్ బిస్ట్ దర్శకత్వంలో రూపొందిన ‘ది ట్రయల్’, ‘గ్యారా గ్యారా’ అనే సిరీస్‌లు ప్రేక్షకుల్ని అలరించాయి. ప్రస్తుతం జాన్వీ ‘లగ్ జా గలే’ అనే రొమాంటిక్ రివెంజ్ డ్రామాలో నటిస్తోంది. ఇటీవలే ‘పెద్ది’ చిత్రంలో అచ్చియమ్మ పాత్రతో సినీప్రియుల్ని ఆకట్టుకున్న జాన్వీ ఉమేశ్ దర్శకత్వంలో ఎలా కనిపించనుందో తెలుసుకోవాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాలి.




# ‘రామాయణ’ ఎవరు ఏ పాత్ర పోషిస్తున్నారంటే..

ఎన్ని సార్లు చదివినా, తెరపై ఎప్పుడు చూసినా నిత్య నూతనంగా అనిపించే ఇతిహాసగాథ ‘రామాయణం’. ఇప్పుడు సరికొత్త హంగులతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. నితేశ్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం ‘రామాయణ’ . రెండు భాగాలుగా రానున్న ఈ మూవీ ఫస్ట్ పార్ట్ ఈ ఏడాది దీపావళి సందర్భంగా థియేటర్స్‌లో సందడి చేయనుంది. ఇటీవల ‘ప్రథమ్ సంకల్ప్’ పేరుతో ప్రచార చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ ట్రైలర్ జులై 24న అందరికీ అందుబాటులోకి రానుంది.వాల్మీకి రాసిన ‘రామాయణం’లో ప్రతి పాత్రకు ప్రత్యేకస్థానం ఉంది. ప్రతి పాత్ర కథను ముందుకు నడిపించేదే. అంతటి గొప్ప రచనాశైలి ఆయనది. అందుకే తాజా చిత్రంలో ఎవరెవరు ఏ పాత్ర పోషిస్తున్నారనే దానిపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది. ఇటీవల విడుదలైన ప్రచార చిత్రంతో కొంత స్పష్టత వచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. మరి ఎవరెవరు?ఏ పాత్రలో నటిస్తున్నారో చూసేయండి.రాముడిగా రణ్‌బీర్‌కపూర్, సీతగా సాయిపల్లవి నటిస్తున్న సంగతి ఇప్పటికే ప్రేక్షకులకు తెలుసు. లక్ష్మణుడిగా రవి దూబే, భరతుడిగా ఆదినాథ్ కొఠారే, శత్రుఘ్నుడిగా నితీశ్ శర్మ నటిస్తున్నారు. రామానంద్ సాగర్ ఆవిష్కరించిన ధారావాహికలో రాముడిగా కనువిందు చేసిన అరుణ్ గోవిల్ ఇప్పుడు దశరథుడిగా నటిస్తున్నారు. ఇక కౌసల్యగా ఇందిరా కృష్ణన్, కైకేయిగా లారాదత్త, సుమిత్రగా సోనల్ ఝా కనిపించనున్నారు. సీబా చద్దా.. మంథర పాత్ర పోషిస్తుండగా, శిశిర్ శర్మ వశిష్ఠ మహర్షిగా, అజింక్య దేవ్ విశ్వామిత్ర మహర్షిగా చేస్తున్నారు.

**రావణ రాజ్యంలో వీరు..**

లంకాధిపతి రావణాసురుడిగా యశ్ నటిస్తున్నారు. పార్ట్-1లో ఈ పాత్ర నిడివి కొద్దిసేపే అయినా ప్రభావవంతంగా ఉంటుందని టాక్ వినిపిస్తోంది. ఇక పార్ట్-2లో రామ, రావణ యుద్ధం తారస్థాయిలో ఉండనుంది. రావణుడి తల్లి కైకసిగా అలనాటి తార శోభన, భార్య మండోదరిగా కాజల్ అగర్వాల్, సోదరి శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్, విభీషణుడిగా హరీశ్ ఉత్తమన్, కుంభకర్ణుడిగా ఫైసల్ మాలిక్ నటిస్తున్నారు. శూర్పణఖ భర్త విద్యుత్‌జిహ్వుడుగా వివేక్ ఒబెరాయ్ కనిపించనున్నారు.ఇక రామాయణంలో మరో కీలక పాత్ర హనుమగా సన్నీ దేవోల్ నటిస్తున్నారు. ఇంద్రుడిగా కునాల్ కపూర్, అగస్త్య మహామునిగా ముకేశ్ తివారి కనిపించనున్నారు. జటాయువు పాత్రకు బాలీవుడ్ స్టార్ అమితాబ్ వాయిస్ ఓవర్ ఇచ్చారంటూ వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. కానీ, అనుపమ్‌ఖేర్ వాయిస్ ఓవర్ ఇచ్చారు. మారీచుడిగా సౌరబ్ సచ్‌దేవ్, తాటకిగా కాంచన్ చేతన్ నటిస్తున్నారు



# నువ్వు ఎంత ఎదిగినా నా లిటిల్ స్టార్‌వే.. సితారకు మహేశ్ స్పెషల్ విషెస్

అగ్ర కథానాయకుడు మహేశ్‌బాబు తన కుమార్తె సితారకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. ఆమెను ప్రేమతో ముద్దాడుతున్న ఫొటోను పంచుకుంటూ ఎంత ఎదిగినా సితార తన లిటిల్ స్టారేనంటూ ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టారు.“నువ్వు ఎంత పెద్దదానివైనా.. నాకు మాత్రం ఎప్పటికీ నా లిటిల్ స్టార్‌వే. 14వ పుట్టినరోజు శుభాకాంక్షలు సితార . ఈ ఏడాది నీకు అద్భుతంగా సాగాలని కోరుకుంటున్నాను. నిన్ను ఎప్పటికీ ప్రేమిస్తూనే ఉంటాను’ అంటూ మహేశ్ పేర్కొన్నారు. ప్రస్తుతం మహేశ్ చేసిన పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అభిమానులతో పాటు సినీ ప్రముఖులు కూడా సితారకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.నమత్రా శిరోద్కర్ కూడా సితారకు శుభాకాంక్షలు చెబుతూ పోస్టు పెట్టారు. ‘మా జీవితాల్లో ఎంతో ఆనందం, ప్రేమను నింపిన నా అందాల కూతురికి పుట్టినరోజు శుభాకాంక్షలు. నీ ఎదుగుదలను చూస్తుండటం నాకు దక్కిన అతి పెద్ద వరం. హ్యాపీ బర్త్ డే. ప్రేమతో..’ అని ఆమె పేర్కొన్నారు.

Printed, Published & Owned by Boda prakash s/o krishna h.no 3-2 satyanarayana puram Edulapuram khammam rural Telanagana 507003 , Printed at Maddineni Nageshwara Rao , H.NO 1-17 18 , Svn Colony, Edulapuram, khammam rural Telanagana 507003, EDITOR : Boda prakash PH : 9000005078 & 9133935333 , RNI. NO TGTEL/26/A0372. EMAIL: manamahati@gmail.com